AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

22-5-2026 (Friday) MAIN EDITION

## 8వేల ప్రైవేట్ ఆస్పత్రులకు తమిళనాడు ప్రభుత్వం అనుమతి



**అక్షరటుడే, చెన్నై:** తమిళనాడు ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. 8 వేల కొత్త ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రభుత్వం తాత్కాలిక అనుమతులు ఇచ్చింది. కొత్త ప్రైవేట్ ఆస్పత్రుల ప్రారంభానికి తాత్కాలిక అనుమతిని మంజూరు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం ఉత్తర్వును జారీ చేసింది. అవసరమైన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే తాత్కాలిక ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని, సమగ్ర తనిఖీ అనంతరం శాశ్వత ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామని వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి అరుణ్‌రాజ్ పేర్కొన్నారు.

## హీరా గ్రూప్ ఎండీ నౌహీరా షేక్ అరెస్ట్



**అక్షరటుడే, హైదరాబాద్:** హీరా గ్రూప్ ఎండీ నౌహీరా షేక్‌ను ఈడీ అధికారులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. హర్యానాలోని గుర్గావ్‌లో తల దాచుకున్న ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను గుర్గావ్ నుంచి హైదరాబాద్‌కు తరలించనున్నారు. నౌహీరా షేక్ హీరా గ్రూప్ పేరిట ప్రజలను మోసం చేసింది. ఏడాదికి 36 శాతం లాభాలు ఇస్తామని చెప్పి ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసింది. ఇలా మొత్తం రూ.5,978 కోట్లు వసూలు చేసి ప్రజలను మోసం చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు హీరా గ్రూప్ ఎండీపై కేసు నమోదైంది.

### లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏడీఈ



**అక్షరటుడే, మెదక్:** మెదక్ జిల్లా నర్సాపూర్‌లో లంచం తీసుకుంటూ విద్యుత్ శాఖ ఏడీఈ రమణారెడ్డి ఏసీబీకి చిక్కాడు. ఏడీఈ ముద్దం రమణారెడ్డి ఓ వ్యక్తికి నుంచి రూ.25 వేల లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు సమాచారం అందించాడు. ఫిర్యాదుదారుడి నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు.

### బీజేపీ ప్రజాప్రతినిధుల బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్



**అక్షరటుడే, హైదరాబాద్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో ప్రజాప్రతినిధుల బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. భేటీకి రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించారు.

### భారత్‌లో సైప్రస్ అధ్యక్షుడి పర్యటన



**అక్షరటుడే, ఢిల్లీ:** సైప్రస్ అధ్యక్షుడు క్రిస్టోడౌలైడ్స్ భారత్‌లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఇరుదేశాల మధ్య కీలక ఒప్పందాలు జరిగాయి. ఫిన్‌టెక్ ఎకోసిస్టమ్స్, రీసెర్చ్ మడ్స్, కౌంటర్ టెర్రరిజం, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర వాటిపై ఎంవోయూలు కుదిరాయి.

# మాటు వేసి పులి దాడి



- నలుగురు మహిళలు మృతి
- తునికాకు కోసం వెళ్లిన సమయంలో ఘటన
- మహారాష్ట్రలో విషాదం

**వారంతా తునికాకు సేకరణ కోసం అడవికి వెళ్లారు. దానిని విక్రయించి నాలుగు రూపాయలు తెచ్చుకుందామని భావించారు. పచ్చని అడవిలో తునికాకు కోసం వెతుకున్న వారిపై.. పొదల్లో దాగి ఉన్న పెద్ద పులి దాడి చేసింది. ఉపాధి కోసం అడవికి వెళ్లిన వారిని పులి రూపంలో మృత్యువు కబళించింది. ఈ ఘటన మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో చోటు చేసుకుంది. పులి దాడితో నలుగురు మహిళలు అక్కడికక్కడే చనిపోయారు.** –అక్షరటుడే, నేషనల్‌డెస్క్

మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా సిందేవాహి తాలూకాలోని గుంజవాహి గ్రామానికి చెందిన 13 మంది మహిళలు శుక్రవారం తెల్లవారుజామున తునికాకు (బీడీల ఆకు) కోసం అడవిలోకి వెళ్లారు. ఉదయం 8 గంటల సమయంలో వారిపై పులి దాడి చేసింది. ఈ ఘటనలో నలుగురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా 9 మంది గాయాలతో బయటపడ్డారు. విదర్భ ప్రాంతంలోని చంద్రాపూర్ జిల్లాలో తాడోబాఅంధారి టైగర్ రిజర్వ్ ఉంది. ఇక్కడ పులులు సంచరిస్తుంటాయి. ఈ క్రమంలో పెద్దపులి దాడిలో నలుగురు చనిపోయారు.

**తీవ్ర విషాదం**

పులి దాడిలో నలుగురు చనిపోవడంతో గుంజవాహి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. అటవీ ప్రాంతంలోని గ్రామస్థుల్లో భయాందోళనలను రేకెత్తించగా, అటవీ శాఖ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తును ప్రారంభించారు. పులి దాడిలో మృతి చెందిన వారిని కవిత దాదాజీ మోహుర్లే (45), అనితా దాదాజీ మోహుర్లే (46), సంగీతా సంతోష్ చౌదరి (40), సునీతా కౌశిక్ మోహుర్లే (33)గా గుర్తించారు. ఈ ఘటనతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తం అయ్యారు. అడవిలోకి ఒంటరిగా వెళ్లొద్దని సమీప గ్రామాల ప్రజలకు సూచించారు.

**ఉపాధి కోసం..**

ఘటన గ్రామస్థుల్లో భయాందోళనలను, ఆగ్రహాన్ని రేకెత్తించింది. వేసవిలో ఈ ప్రాంతంలోని కుటుంబాలకు ప్రధాన ఆదాయ వనరు తునికాకు సేకరణ. ఇప్పుడు పులిదాడితో వారు అడవిలోకి వెళ్లాలంటే భయపడుతున్నారు. కాగా అటవీ ప్రాంతాల్లోని ప్రజలు వేసవిలో తునికాకు సేకరించి విక్రయిస్తుంటారు. దీనిద్వారా ఉపాధి పొందుతారు. నిత్యం తెల్లవారు జామున అడవిలోకి వెళ్లి ఆకును సేకరిస్తారు. పులిదాడిలో నలుగురు ఒకేసారి మృతి చెందడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై వారు మండిపడుతున్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

## సీబీఎస్ఈ త్రిభాషా విధానంపై సుప్రీంలో పిల్

**అక్షరటుడే, ఢిల్లీ:** సీబీఎస్ఈ 9వ తరగతి విద్యార్థుల కోసం తీసుకువచ్చిన 'త్రిభాషా విధానం' ఇప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానానికి చేరింది. 9వ తరగతి చదివే విద్యార్థులు మూడు భాషలను తప్పనిసరిగా నేర్చుకోవాలంటూ సీబీఎస్ఈ జారీ చేసిన తాజా నిబంధనలను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. కొంతమంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉమ్మడిగా ఈ పిటిషన్‌ను వేశారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీల త్రిసభ్య ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ఈ విషయాన్ని ప్రస్తావించారు. వాదనలను పరిశీలించిన సీజేఐ పిటిషన్‌ను వచ్చే వారం విచారణల జాబితాలో చేరుస్తామని, దీనిపై త్వరలోనే విచారణ జరుపుతామని చెప్పారు.



## రూపాయి విలువ తగ్గడమే మంచిదే..

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అస్థిరతల వల్ల దేశీయ కరెన్సీ రూపాయి విలువ నిరంతరం పడిపోతున్న నేపథ్యంలో, నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ అరవింద్ పణగరియ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు పలు కీలక సూచనలు చేశారు. చమురు సంక్షోభం తక్కువ కాలం ఉన్నా లేదా ఎక్కువ కాలం కొనసాగినా రూపాయి విలువ తగ్గడాన్ని అనుమతించడమే మంచిదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

## తెలంగాణకు మరిన్ని నిధులు ఇవ్వాలి : మంత్రి సీతక్క



**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రధాన్ మంత్రి గ్రామ సడక్ యోజన కింద తెలంగాణకు మరిన్ని రహదారి పనులు మంజూరు చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసి గిరిజన మారుమూల ప్రాంతాల్లో రహదారి అనుసంధానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో జరిగిన దక్షిణాది రాష్ట్రాల పీఎంజీఎస్‌వై ప్రాంతీయ సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొని రాష్ట్ర సమస్యలు, అవసరాలను కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గత 25 ఏళ్లుగా పీఎంజీఎస్‌వై గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, మార్కెట్లకు రాకపోకలను మెరుగుపరిచిందన్నారు. ప్రస్తుతం ఈ పథకం మారుమూల గ్రామాలు, ఆదివాసి గిరిజన గూడెలను, మైదాన ప్రాంతాలతో అనుసంధానం చేస్తుందన్నారు. గతంలో ప్రధానమంత్రి గ్రామీణ యోజనకు 100 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించేదని, కానీ ప్రస్తుతం నిబంధనలు మార్చి రాష్ట్రాలపై 40 శాతం భారం వేస్తోందన్నారు. ఆ విధానాన్ని పునఃసమీక్షించాలని కోరారు.

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం: కేటీఆర్




**అక్షరటుడే, హైదరాబాద్:** ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా వడ్లు కొనక 45 రోజుల్లో 10 మంది చనిపోతే ఒక్కరు కూడా చనిపోలేదని సివిల్ సప్లయ్స్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సిగ్గు లేకుండా అబద్ధాలు చెబుతున్నారని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు 35 శాతం కూడా దాటలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 45 డిగ్రీల ఎండలు కొడుతున్నా.. రైతులు ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ చూసినా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి 80శాతం కొనుగోళ్లు చేశామని చెబుతున్నారని, మంత్రి ఏమో 50 కొన్నట్లు చెప్పారన్నారు. కానీ క్షేత్రస్థాయిలో 35 శాతం దాటలేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. సీఎం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సెక్రటేరియట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత..

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ 'తెలంగాణ రక్షణ సేన' అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సెక్రటేరియట్ ముట్టడికి దిగారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరుగు పేరిట రైతులను నష్టపరచవద్దని, అన్నదాతలకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయం పరిసరాల్లో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన తెలపడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కవితతో పాటు పార్టీ శ్రేణులను, ఇతర నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.


## సీక్రెట్ మ్యారేజ్ రూమర్లపై కంగనా క్లారిటీ!



బాలీవుడ్ ఫైర్ బ్రాండ్, ఎంపీ కంగనా రనౌత్ మెడలో మంగళసూత్రం, చేతులకు మట్టి గాజులతో ట్రెడిషనల్ లుక్‌లో కనిపించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఆమె రహస్యంగా పెళ్లి చేసుకుందంటూ నెట్టింట పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దీంతో ఈ రూమర్లపై కంగనా స్వయంగా స్పందించి అసలు నిజాన్ని వెల్లడించారు. సినిమా క్యారెక్టర్ మేకప్‌లో ఉన్నప్పుడు ఎవరో తీసిన వీడియో ఇదని, తాను ఎప్పుడూ సీక్రెట్‌గా పెళ్లి చేసుకోనని అభిమానులకు ప్రామిస్ చేశారు.

– అక్షరటుడే, సినిమాడెస్క్

## ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం..: హరీశ్‌రావు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఫార్మాసిటీ కోసం 16వేల ఎకరాలు భూసేకరణ చేసి ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ తెచ్చామని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఆ భూమిని ఫార్మాసిటీ కాకుండా వేరే అంశాల కోసం వాడితే.. రైతుల భూమి వెనక్కి ఇచ్చేయాలని చట్టం చెబుతోందన్నారు. మొన్న హైకోర్టులో కేసు విచారణకు వస్తే.. తాము ఫార్మా సిటీ రద్దు చేయడం లేదని ప్రభుత్వం అబద్ధాలు చెప్పిందన్నారు.

## రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల




**అక్షరటుడే, ఢిల్లీ:** రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఎన్నికల సంఘం జూన్ 1న నోటిఫికేషన్ విడుదల చేయనుంది. 10 రాష్ట్రాల్లోని 24 రాజ్యసభ స్థానాలకు జూన్ 18న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది. రాజ్యసభ ఎన్నికలతో పాటు మహారాష్ట్ర, తమిళనాడులలో ఒక్కో స్థానానికి ఉప ఎన్నికలు జరపనున్నట్లు ఎన్నికల సంఘం శుక్రవారం ప్రకటించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కర్ణాటకకు చెందిన మాజీ ప్రధాని దేవెగౌడతో సహా, ప్రస్తుతం ఆ స్థానాల్లో కొనసాగుతున్న సభ్యుల పదవీకాలం జూన్, జూలై నెలల్లో ముగియనుంది. మొత్తం 24 స్థానాలు ఖాళీ కానున్నాయి. దీంతో ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు, గుజరాత్‌లో ఐదు, జార్ఖండ్‌లో రెండు, మధ్యప్రదేశ్‌లో మూడు, మణిపూర్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, మిజోరాంలలో ఒక్కోటి చొప్పున, కర్ణాటకలో నాలుగు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

## కేరళ శాసనసభ స్పీకర్‌గా తిరువంచూర్ రాధాకృష్ణన్



**అక్షరటుడే, తిరువనంతపురం:** కేరళ 16వ శాసనసభ స్పీకర్‌గా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ హోం మంత్రి తిరువంచూర్ రాధాకృష్ణన్ మే 22న బాధ్యతలు స్వీకరించారు. ఎన్నిక అనంతరం ముఖ్యమంత్రి వీడీ సతీశన్, ప్రతిపక్ష నేత పినరయి విజయన్‌లు ఆయనను గౌరవపూర్వకంగా స్పీకర్ కుర్చీ వద్దకు నడిపించారు. కొత్తగా ఎన్నికైన 140 మంది ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారంతో తిరువనంతపురంలో ప్రారంభమైన అసెంబ్లీ తొలి సమావేశాల్లో భాగంగా ఈ ఎన్నిక జరిగింది. అధికార యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తరపున తిరువంచూర్ రాధాకృష్ణన్ అభ్యర్థిగా నిలవగా, ప్రతిపక్ష ఎల్‌డీఎఫ్ తరపున సీనియర్ సీపీఐ(ఎం) నాయకుడు ఏసీ మొయిదీన్, ఎన్డీఏ కూటమి తరపున చాతన్నూర్ ఎమ్మెల్యే బీబీ గోపకుమార్ పోటీ పడ్డారు. ఫలితాలను ప్రకటించిన ప్రొ టెం స్పీకర్ జి.సుధాకరన్, రాధాకృష్ణన్‌కు 101 ఓట్లు, ఏసీ మొయిదీన్‌కు 35 ఓట్లు, బీబీ గోపకుమార్‌కు 3 ఓట్లు వచ్చాయని, ప్రొటెం స్పీకర్‌గా తాను ఓటు వేయలేదని తెలిపారు. అనంతరం సుధాకరన్ కొత్త స్పీకర్‌కు అభినందనలు తెలుపుతూ, తనకు సహకరించిన సభకు కృతజ్ఞతలు తెలియజేశారు.